క్లుప్తంగా

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



గ్రంథాలయానికి పుస్తకాలు అందజేస్తున్న రామరాజు

పాతపట్నం: మండలంలోని ఆర్.ఎల్.పురం గ్రామంలో ఉన్న సరస్వతి గ్రంథాలయానికి పాతపట్నానికి చెందిన రామరాజు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు, ఉపాధ్యాయుడు పారిశెల్లి రామరాజు వివిధ రకాల పుస్తకాలు ఆదివారం అందించారు. ట్రస్ట్ మాజీ గౌరవ అధ్యక్షుడు, విశ్రాంత ఎంఈఓ కె.త్రినాథరావు ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంపోలు మధుబాబు, మాజీ ఎంపీటీసీ గోళ్ల సంజీవ రావు, అంపోలు మన్మథరావు, కణితి బాలయ్య, డి.సాయిప్రసాద్, కె.కోటేశ్వరరావు, ఎస్.ప్రవీణ్, ఎస్.విష్ణుకుమార్, పాఠకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులుగా అక్కాచెల్లెళ్లు..



ఆమణి, లావణ్య

హిరమండలం: ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం అంటే ఎంతో కష్టమైన రోజులివి. అటువంటిది ఒకే ఇంట్లో అక్కాచెల్లెళ్లు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడంతో ఆ పేదింట ఆనందం వెల్లివిరిసింది. మండలంలోని పింద్రువాడ గ్రామానికి చెందిన పాగోటి ఆమని, లావణ్య అక్కాచెల్లెళ్లు. తల్లిదండ్రులు సాధారణ రైతులు. డైట్ పూర్తిచేసిన వీరిద్దరూ గత కొన్నేళ్లుగా డీఎస్సీ కోసం కోచింగ్ తీసుకున్నారు. ఈ క్రమంలో డీఎస్సీ ఎస్టీటీ విభాగంలో కర్నూలు జిల్లాలో పరీక్ష రాశారు. 87.7 మార్కులతో ఆమని, 83.4 మార్కులతో లావణ్య ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరిని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అభినందిస్తున్నారు.

మావుదూరికి 'ప్రతిభ జ్యోతిష్యరత్న'



అవార్డు అందుకున్న అన్నాజీరావు మాస్టారు

ఆమదాలవలస: మండలంలోని మునగవలస గ్రామానికి చెందిన జ్యోతిష్య, వాస్తు పండితుడు, తెలుగు అధ్యాపకుడు మావుదూరి అన్నాజీరావుకు 'ప్రతిభ జ్యోతిష్య రత్న' అవార్డు వరించింది. విశాఖకు చెందిన ప్రతిభ క్రీడా సాంస్కృతిక సంస్థ 25వ వార్షికోత్సవం సందర్భంగా అన్నాజీరావుకు ఆదివారం అవార్డును అందించారు. గత 25 ఏళ్లుగా సేవా సంస్థ ఆధ్వర్యంలో వివిధ రంగాల వారికి అవార్డులను అందిస్తున్నారు. విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ప్రతిభ అడవి రాజు ఆధ్వర్యంలో అవార్డును అందించారు. అన్నాజీరావు మాస్టారు గత 25 ఏళ్లగా లలితా కామేశ్వరమ్మ జ్యోతిష్యాలయం ద్వారా ప్రజలకు సేవలు అందిస్తున్నారు. సీతంపేట గిరిజన కళాశాలలో తెలుగు అధ్యాపకునిగా కొనసాగుతున్నారు. అన్నాజీరావు మాస్టార్‌కు అవార్డు రావడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

ర్యాలీని విజయవంతం చేయండి



చింతాడ రవికుమార్

ఆమదాలవలస: ఖరీఫ్ సీజన్ సగం అయిపోతున్నా రైతులకు ఎరువులు అందక నానా ఇక్కట్లు పడుతున్నారని, రైతు సమస్యలు ఈ ప్రభుత్వానికి పట్టవా అని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైతు సమస్యల పరిష్కారం కోసం పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు శ్రీకాకుళంలోని ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద గల జ్యోతీరావు పూలే విగ్రహం నుంచి జిల్లా పరిషత్ వరకు సోమవారం ర్యాలీ ఉంటుందన్నారు. ఉదయం 9.30 గంటలకు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఎరువులు అందజేయాలి

బూర్జ: రైతులకు పూర్తిస్థాయిలో ఎరువులు అందజేయాలని జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురం రామారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బూర్జలో విలేకర్లతో మాట్లాడారు. ఎరువుల కొరత అంశాన్ని రాష్ట్ర పాలకులు కేంద్ర ప్రభుత్వంపై నెట్టడం సిగ్గు చేటన్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సొంత జిల్లాలోనే రైతుల పరిస్థితి ఇలా ఉంటే.. మిగతా జిల్లాల్లో పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో అర్థమవుతుందని ఎద్దేవా చేశారు. రైతులును అన్నివిధాలుగా ఆదుకోకపోతే వైఎస్సార్‌సీపీ తరఫున ఆందోళన తప్పదని హెచ్చరించారు. మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, ఆమదాలవలస నియోజకవర్గం ఇంటలెక్చువల్ కన్వీనర్ బొడ్డేపల్లి నాగరాజు, మండల వ్యవసాయ కార్యదర్శి సైరిగాపు గోవిందరావు, నాయకులు మజ్జి నర్సింగరావు, సైరిగాపు శివ, తదితరులు పాల్గొన్నారు.



పెచ్చులూడిన రొట్టవలస ప్రాథమిక పాఠశాల



ఆమదాలవలస మండలం తమ్మయ్యపేటలో నిరుపయోగంగా ఉన్న పాఠశాల భవనం

బడికి వెళ్లాలంటే.. భయమేస్తోంది..!



వీరభద్రాపురంలో పాత పాఠశాల భవనం

- శిథిల భవనాల్లో బిక్కుబిక్కుమంటున్న విద్యార్థులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు
- పట్టని కూటమి ప్రభుత్వం

సరుబుజ్జిలి: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాడు–నేడు పథకం ద్వారా అనేక పాఠశాలల రూపురేఖలను మార్చింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో బడికి వెళ్లాలంటే భయమేస్తోంది. గదిలో కూర్చొని పాఠం విందామంటే.. ఎప్పుడు పైకప్పు కూలిపోతుందోనని విద్యార్థుల్లో ఒకటే ఆందోళన. పాఠశాల భయటకు వెళ్తే పక్కనే నిరుపయోగంగా ఉన్న శిథిల భవనం ఎప్పుడు కూలుతుందోనని భయం పట్టుకుంది. ఇన్ని భయాల మధ్య విద్యార్థులు పాఠశాలలకు వెళుతున్నా.. అధికారులు, పాలకులు ఇవేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలో 242 ప్రభుత్వపాఠశాలలున్నాయి. వీటిలో దాదాపు 57 పాఠశాలల వరకు శిథిలావతిలో ఉన్నాయి.

మంజూరుకాని నిధులు

నూతన భవనాల మంజూరు, మరమ్మతులు, శిథిల భవనాలు తొలగించాలంటే ఒక్కో భవనానికి రూ.50 వేల నుంచి రూ.లక్ష ఖర్చు అవుతుంది. నిధుల సమస్యతో కొన్ని భవనాలు అలాగే విడిచిపెట్టగా..మరికొన్ని చోట్ల వాటిలోనే పాఠాలను బోధిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన నాడు–నేడు పాఠశాలల భవన నిర్మాణాలు తప్ప.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్కచోట కూడా భవన నిర్మాణ పనులు చేపట్టలేదు.

ఆమదాలవలస నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల వివరాలు..				
మండలం	ఆమదాలవలస	సరుబుజ్జిలి	పొందూరు	బూర్జ
పాఠశాలలు	99	53	70	60
శిథిలమైనవి	16	12	15	14

ప్రభుత్వానికి నివేదిక అందించాం

శిథిల భవనాల కోసం పలుమార్లు ప్రభుత్వానికి నివేదికలు అందించాం. నూతన భవనాల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం.

– డి.బాలరాజు, ఎంఈఓ, సరుబుజ్జిలి

పైసా కూడా ఖర్చు చేయలేదు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పాఠశాలల భవనాల విషయంలో పైసా కూడా ఖర్చు చేయలేదు. అనవసర కార్యక్రమాలకు ప్రభుత్వం నిధులను దుబారా చేస్తుంది. విద్యార్థుల సంక్షేమం కోసం పట్టనట్లు వ్యవహరిస్తుంది. దీనివలన విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

– పైడి మోహన్‌రావు, విద్యార్థి తండ్రి, మతలబుపేట

శిథిల భవనాల వైపు చూడని కూటమి ప్రభుత్వం..

పలు పాఠశాలల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నా.. కూటమి ప్రభుత్వం పూర్తిగా అటువైపు దృష్టిసారించక పోవడంతో విద్యార్థులకు తిప్పలు తప్పడంలేదు. సరుబుజ్జిలి మండలంలో బప్పడాం, బురిడివలసకాలనీ, ఎ.ఎల్.నగరం, రావివలస, పాలవలస, సుభద్రాపురం, రొట్టవలస, వీరభద్రాపురం, సుబ్బపేటలో పాఠశాలల భవనాలు శిథిలమయ్యాయి. వర్షం వస్తే చాలు గదుల నిండా నీరుచేరుతోంది. పొందూరు మండలంలో ఎరుకలకాలనీ, బాపిరాజుపేట పాఠశాలలు పాడయ్యాయి. బూర్జ మండలంలో నారాయణపురం, పీఎల్‌దేవిపేట, ఉప్పినివలస హైస్కూళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి.

గతమెంతో ఘనం...



నాడు-నేడు ద్వారా ఆధునీకరించిన పురుషోత్తపురం హైస్కూల్

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో శిథిలమైన పాఠశాలలకు నాడు–నేడు ద్వారా రూపురేఖలు పూర్తిగా మార్చేశారు. నియోజకవర్గంలో రూ.110 కోట్లతో పాఠశాలల మరమ్మతులు, ఫర్నచర్, బాత్ రూమ్‌లు, ప్రహరీలు, ప్లాట్ ఫామ్‌లు, ఫ్లోరింగ్, పెయింటింగ్స్ కోసం వెచ్చించారు. పాఠశాలలను కనీవినీ ఎరుగని రీతిలో ఆధునీకరించారు.



నాడు-నేడు ద్వారా రూపుదిద్దుకున్న పురుషోత్తపురం హైస్కూల్ మరుగుదొడ్లు

ప్రమాదస్థితిలో చదువులు



చాలాచోట్ల పాఠశాలల భవనాలు కూలిపోయే స్థితిలో ఉన్నాయి. ఏ మాత్రం వర్షం వచ్చినా పైకప్పునుంచి వర్షంనీరు గదుల్లో చేరుతుంది. విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ తరగతులకు వస్తున్నారు. నిరుపయోగంగా ఉన్న భవనాలను తొలగించేందుకు చర్యలు చేపట్టాలి.

– ఇల్లాకుల శ్రీనివాసరావు, నందికొండకాలనీ

ఎత్తిపోతల పథకాన్ని బాగుచేయాలి



ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న చింతాడ రవికుమార్, నాయకులు

- వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త రవికుమార్

బూర్జ: మండలంలోని నీలాదేవిపురం (నీలంపేట) గ్రామ ఎత్తిపోతల పథకాన్ని తక్షణమే బాగుచేయాలని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ డిమాండ్ చేశారు. ఉప్పపేట వద్ద ఉన్న ఎత్తిపోతల పథకాన్ని ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా నీలాదేవిపురం గ్రామంలో మాట్లాడుతూ.. సుమారు 800 ఎకరాలకు సాగునీరు నాగావళి నది నుంచి ఈ ఎత్తిపోతల పథకం ద్వారా అందేదన్నారు. ఉప్పపేట, నీలాదేవిపురం, సంకురాడ, బూర్జ, కేకే రాజపురం, మామిడివలస, పరిసర గ్రామాల పరిధిలో ఉన్న వ్యవసాయ భూములకు ఈ పథకం ద్వారా గత సంవత్సరం వరకు నీరు అందేదని.. ప్రస్తుతం పనిచేయక పోవడం ఏంటని ప్రశ్నించారు. రూ.5 లక్షలు ఖర్చుపెడితే వినియోగంలోకి వస్తుందన్నారు. వ్యవసాయం దండగ అనే సీఎం చంద్రబాబుకి ఇవేమి పట్టవని ఆరోపించారు. రైతులు ఒక్క బస్తా యూరియా కూడా లభించక ఇబ్బంది పడుతున్నారన్నారు. ఎత్తిపోతల పథకం మరమ్మతుల విషయాన్ని జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, నాయకులు మజ్జి నర్సింగరావు, జల్లు ఆదినారాయణ, సాకేటి శ్రీనివాసరావు, సైరిగాపు శివ, రైతులు పాల్గొన్నారు.

నిబంధనలు తప్పనిసరి



డీఎస్పీ లక్ష్మణరావు

హిరమండలం: వినాయక నిమజ్జనోత్సవాల్లో నిబంధనలు పక్కాగా పాటించాలని టెక్కలి డీఎస్పీ డి.లక్ష్మణరావు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆదివారం సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సరిహద్దు ప్రాంతం కావడంతో నిత్యం అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. కేసుల విచారణలో పురోగతిపై ఆరా తీశారు. స్టేషన్ ప్రాంగణాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎస్‌ఐ ఎండీ యాసిన్ ఉన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

కొత్తూరు: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ దండు ప్రకాశరావు, జిల్లా కార్యదర్శి బోద శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మెట్టూరు గ్రామంలో ఆదివారం పాతపట్నం నియోజకవర్గ స్థాయిలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు నిర్వహించిన షెటిల్ బ్యాడ్మింటిన్ (డబుల్స్) పోటీలను ప్రారంభించారు. ఐదు మండలాల నుంచి 15 టీమ్‌లు పాల్గొన్నాయి. విజేతలకు సెప్టెంబర్ 5వ తేదీన నిర్వహించే ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా బహుమతులు అందించనున్నారు.

108 రకాల ప్రసాదాలతో నివేదన



హిరమండలంలోని అంధవరపువారి వీధిలో వినాయక నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం స్వామివారికి 108 రకాల ప్రసాదాలతో మహా నివేదన చేపట్టారు. వివిధ వంటకాలతోపాటు స్వీట్లును నైవేద్యంగా పెట్టారు. ఇక్కడ రోజుకో రీతిలో స్వామివారికి అన్నప్రసాదాలు, పూజా కార్యక్రమాలు చేపడుతున్నారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

– హిరమండలం

దీపారాధన..



పొందూరు మండలం తోలాపి గ్రామంలోని దేవాంగుల వీధిలో వరసిద్ధి వినాయక చవితి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం కుంకుమ పూజలు, అర్చనలు, దీపారాధన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

– పొందూరు

గోతులమయం..



ఈ చిత్రం ఆమదాలవలస నుంచి సరుబుజ్జిలి మండలం రొట్టవలస వరకు గల ఆర్అండ్‌బీ రహదారిలో పొన్నాంపేట వద్ద ఏర్పడిన గుంతలు. చిన్న వర్షం కురిసినా నీరుచేరి ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.కొంతమేర రహదారి పనులు చేసి మిగిలిన పనిని విడిచిపెట్టారు. ఎక్కడ గొయ్యి ఉందో తెలియక ప్రమాదాల బారినపడుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

రహదారిపై మురుగునీరు నిల్వ



ఈ చిత్రం సారవకోట మండలంలోని వడ్డినవలస సమీపంలో జాతీయ రహదారి 326–'ఎ'పై నిల్వ ఉన్న మురుగునీరు. ఈ గ్రామం వద్ద జాతీయ రహదారికి మురుగునీటి కాలువలను పూర్తిస్థాయిలో అనుసంధానం చేయలేదు. ప్రస్తుతం మురుగునీటి కాలువలు పూడికలతో నిండిపోయాయి. వర్షం నీటితోపాటు మురుగునీరు రోడ్డుపై నిల్వ ఉంటుంది. ప్రయాణికులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.

– సారవకోట

పంచాయతీ కార్యాలయాన్ని కూల్చడం సరికాదు

- వైఎస్సార్‌సీపీ నాయకుడు నారాయణమూర్తి



అన్న క్యాంటీన్‌ను నిర్మించే స్థలాన్ని చూపిస్తున్న నారాయణమూర్తి

పాతపట్నం: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయాన్ని కూల్చివేసి అన్న క్యాంటీన్ నిర్మించడం సరికాదని వైఎస్సార్‌సీపీ నాయకుడు బి.నారాయణమూర్తి అన్నారు. కూల్చివేసిన పంచాయతీ కార్యాలయ స్థలాన్ని ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో అన్న క్యాంటిన్‌ను నిర్మాణం చేపట్టడం వల్ల ప్రజలు ఇబ్బంది పడే పరిస్థితులు ఏర్పడతాయన్నారు. పంచాయతీ కార్యాలయం కూల్చివేత నిబంధనలకు విరుద్ధమన్నారు.

అన్న క్యాంటిన్‌ను వేరేచోట నిర్మాణం చేపట్టాలని కోరినప్పటికీ పట్టించుకోకుండా పంచాయతీ కార్యాలయాన్ని కూల్చివేయడం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అహంకారానికి నిదర్శనమన్నారు. ప్రభుత్వ ఆస్తులను, ప్రకృతిని, పర్యావరణాన్ని కాపాడాల్సి బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

గణనాథునికి ప్రత్యేక పూజలు



బూర్జ: ఓవీపేటలో నిర్వహించిన అన్నదానంలో పాల్గొన్న భక్తులు



ఆమదాలవలస: పాతినవారి వీధిలో అన్నప్రసాదాలను వడ్డిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్

గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఐదో రోజైన ఆదివారం విఘ్నేశ్వరుడికి ప్రత్యేక, విశేష పూజలు, కుంకుమార్చలు చేపట్టారు. స్వామికి నైవేద్యాలు సమర్పించారు. పలు గ్రామాల్లో అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. గణనాథుని లడ్డూను వేలం వేశారు. పలుచోట్ల వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



నరసన్నపేట: కొత్తవీధిలోని వినాయకునికి పూజలు నిర్వహిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్



సారవకోట: కర్ణం వీధిలో వినాయక ప్రతిమను నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు



కొత్తూరు: కొత్తూరులో అన్నప్రసాద కార్యక్రమం

దాతలు సహకరించాలి



మాట్లాడుతున్న లక్ష్మణరావు

హిరమండలం: స్థానిక సత్యసాయి మందిరం నిర్మాణానికి దాతలు సహకరించాలని సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు రఘుపాత్రుని లక్ష్మణరావు కోరారు. నిర్మాణంలో ఉన్న సత్యసాయి మందిరాన్ని ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సత్యసాయి బాబా శత జయంతి వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. బాబా మందిరాన్ని అక్టోబర్‌లో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు చెప్పారు. మందిరం నిర్మాణానికి శ్రీకాకుళం నగరానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయిరాలు బాలామణి రూ.50 వేలను వితరణగా అందజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర రామచంద్రరావు, ఎ.అబ్బాయి, ఎ.వి.సురేష్, సాయిబాబా, బుచ్చాబ్బాయి, చంటి మాస్టారు, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..



గుత్తావల్లిలో చల్లంనాయుడును పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్

బూర్జ: మండలంలోని పలు కుటుంబాలను వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఆదివారం పరామర్శించారు. గుత్తావల్లి గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు బొడ్డేపల్లి నాగరాజు అనారోగ్యంతో చికిత్స పొందడంతో ఆయనను, గుండె శస్త్ర చికిత్స చేయించుకున్న బొడ్డేపల్లి ముకుందరావును, పాము కాటుకు గురై కోలుకుంటున్న చల్ల చల్లంనాయుడును పరామర్శించి వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఓవీపేట పంచాయతీ ఒప్పివాడకు చెందిన బగాది కబేరుడు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, మాజీ సర్పంచ్ బొడ్డేపల్లి నారాయణమూర్తి, నాయకులు బొడ్డేపల్లి నాగరాజు, సాకేటి శ్రీనివాసరావు, సైరిగాపు శివ, తదితరులు ఉన్నారు.